

మంత్రివర్గ సమావేశంలో సీఎం, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు

పారిశ్రామిక పెట్టుబడులకు
క్యాబినెట్ ఆమోదం

- 15 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- 24,700 మంది ఉపాధి అవకాశాలు
- స్టాలిన్ అమెరికా పర్యటనపై సమీక్ష

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.44,125 కోట్ల పారిశ్రామిక పెట్టుబడులను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 15 పారిశ్రామిక ప్రాజెక్టులు అమలు చేయడానికి అంగీకారం తెలిపింది. ఈ ప్రాజెక్టులు అమలయితే 24,700మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. విదేశీ పారిశ్రామిక పెట్టుబడుల సేకరణ నిమిత్తం ఈ నెల 27న ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికా పర్యటనకు బయలుదేరనున్న నేపథ్యంలో జరిగిన ఈ మంత్రి వర్గ సమావేశం ఉదయం 11 నుంచి గంటన్నర పాటు సాగింది. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు గురించి మీడియా సమావేశంలో వివరించారు. రూ44125 కోట్ల పెట్టుబడి పథకాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని, వాహనాల తయారీ, ఆహార పదార్థాల ప్రాసెసింగ్ తదితర విభాగాల్లో పెట్టుబడులను కూడా అనుమతించిందని చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఇంధన శాఖకు సంబంధించి మూడు రకాల విధివిధానాలను కూడా ఆమోదించినట్లు పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, హైడల్ విద్యుత్ ఉత్పత్తి, గాలిమరల ద్వారా విద్యుత్ ఉత్పత్తి పథకాలను రెన్యూవల్ చేయడానికి కూడా సమావేశం అంగీకారం తెలిపినట్లు ఆయన చెప్పారు.

ఈరోడ్‌లో మిల్కీమిస్ట్ ఫ్యాక్టరీ..

జిల్లా కేంద్రం ఈరోడ్‌లో రూ.17607 కోట్లతో మిల్కీమిస్ట్ కర్మాగారం ఏర్పాటుకు కూడా మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. 2030లోగా హరిత ఇంధన శక్తిద్వారా 20 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించాలని మంత్రివర్గం సిఫారసు చేసిందని, తూత్తుకుడి జిల్లాలో సెన్ కార్ప్ సంస్థ 21,340 కోట్లతో కొత్త ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు కూడా అనుమతిచ్చిందని తెలిపారు. కాంచీపురంలో మెకర్సన్ ఎలక్ట్రానిక్స్ సంస్థ రెండువేల మందికి పైగా ఉపాధికలిగించేలా రూ.2500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కూడా మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

17న ఫాక్స్‌కాన్ స్టాఫ్ క్వార్టర్స్ ప్రారంభం

ఈ నెల 17న భారతదేశంలోనే తొట్టతొలిసారిగా సిప్కాట్ ఆధ్వర్యంలో కాంచీపురం జిల్లా వల్లమ్‌వడకాల్ ప్రాంతంలో రూ.706.05 కోట్లతో ఫాక్స్‌కాన్ స్టాఫ్ క్వార్టర్స్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని ఆయన చెప్పారు. ఆ క్వార్టర్స్‌లో 18720 మంది సిబ్బంది బసచేయడానికి అనువైన సదుపాయాలుంటాయని ఆయన వివరించారు. ఇక ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికా పర్యటనకు సంబంధించి కూడా సమావేశంలో చర్చ జరిగిందని, త్వరలోనే ఆ పర్యటనకు సంబంధించిన అధికారిక ప్రకటనను ముఖ్యమంత్రి కార్యాలయం జారీ చేయనుందని తంగం తెన్నరసు తెలిపారు.



రాష్ట్రంలోనూ బీజేపీ

తెలంగాణ ఫార్ములా !

- అన్నాడీఎంకేని తృతీయ స్థానానికి కూల్చడం
- నెంబరు 2కు వెళ్లడమే లక్ష్యం
- అన్నామలైకి అమిత్‌షా దిశానిర్దేశం



చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనూ 'తెలంగాణ ఫార్ములా' అమలు చేయాలని బీజేపీ భావిస్తోంది. ఇందుకోసం ప్రతిపక్ష అన్నాడీఎంకేను తృతీయ స్థానానికి నెట్టి, తాను ద్వితీయస్థానానికి ఎగబాకాలని ఆ పార్టీ తలపోస్తోంది. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటికే నుంచే వ్యూహరచన చేయాలని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకి ఆ పార్టీ అధిష్టానం దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అంతేగాక రాజీనామా డిమాండ్లు, తొలగింపులను పక్కనబెట్టి భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆ పార్టీ నేతలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

గత పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఒక్కస్థానం కూడా గెలవలేకపోయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై ఆ పార్టీ నుంచే తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ఆయన్ని ఆ పదవి నుంచి తొలగించాలని పలువురు సీనియర్లు డిమాండ్ చేస్తుండగా, మరికొంతమంది అధిష్టానంతో మాట్లాడి తమ 'ఆలోచన'లకు పదునుపెట్టారు. దీంతో ఏ క్షణంలోనైనా అన్నామలైని తొలగించనున్నారని విస్తృత ప్రచారం జరిగింది. దీనికి తోడు రాజకీయ సదస్సు కోసం కొంతకాలం లండన్ వెళ్లనున్న అన్నామలై కూడా తన పదవి నుంచి వైదొలగాలని భావించినట్లు తెలిసింది. వీటన్నింటిని నేపథ్యంలో రాష్ట్ర బీజేపీకి నూతన సారథి రావడం ఖాయమని అన్నివర్గాలు భావించాయి. అయితే అన్నామలైని ఢిల్లీకి పిలిచిన కమలనాథులు కీలక అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. అన్నామలైని పిలిపించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్రనేత అమిత్‌షా ఇందుకు సంబంధించిన వ్యూహరచన విశదీకరించినట్టు సమాచారం.

గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకున్న బీజేపీ నాలుగు స్థానాలను కైవసం చేసుకున్నవిషయం తెలిసిందే. అయితే గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో చిన్నాచితకా పార్టీలతో పొత్తు పెట్టుకున్న బీజేపీ.. ఒక్కస్థానాన్ని కూడా సాధించుకోలేకపోయింది. అయితే ఆ కూటమికి 18 శాతం ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కేవలం 14 శాతం ఓట్లతో సంతృప్తి చెందిన బీజేపీ.. గత మేలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 8 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించి, బీఆర్ఎస్‌ను తృతీయస్థానంలోకి నెట్టింది. అలాంటప్పుడు తమిళనాడులోనూ అలా ఎదిగేందుకు అవకాశముందని, ఆ ఫలితాల కోసం తామెందుకు ప్రయత్నించకూడదని అమిత్‌షా, జేపీ నడ్డా అన్నామలైకి వివరించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వం చేసే తప్పిదాలను తెలంగాణ నేతలు గట్టిగా నిలదీశారని, అంతేగాక ప్రజా సమస్యలపై గట్టి పోరాటం సల్పారని వివరించిన అగ్రనేతలు.. తమిళనాడులోనూ ఆ విధానాలను అనుసరించాలని స్పష్టం చేశారు. అధికార డీఎంకేను ఇప్పటికిప్పుడు కుప్పకూల్చడం అయ్యేపని కానందున.. ద్వితీయ స్థానంలో వున్న అన్నాడీఎంను బలహీనపర్చడం, ఆ పార్టీని తృతీయ స్థానానికి నెట్టడం ప్రధాన లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు 20 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. దక్షిణ జిల్లాలు, కొంగుమండలంలో అయితే ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోయింది. అందువల్ల 2026 ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో వున్న డీఎండీకే, పుదియతమిళగం వంటి పార్టీలను తమ దరిచేర్చుకుంటే, ఆ పార్టీ బలహీనపడుతుందని, అదే సమయంలో ఆయా పార్టీలను తమ కూటమిలో చేర్చుకుంటే తమ ఓటుబ్యాంకు 30 శాతానికి పెరిగే అవకాశముందని, అప్పుడు తాము ఆశించిన ఫలితాలు అందుకోవడం పెద్ద సమస్య కాబోదని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ముందుగా తెలంగాణ బీజేపీ నేతలతో మాట్లాడి, ప్రజా సమస్యలపై మరింత అవగాహన పెంచుకోవాలని, ఇందుకు అవసరమైతే ఓ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. తెలంగాణ వ్యూహాన్నే రాష్ట్రంలోనూ అమలు చేయాలని, అది సత్ఫలితాలను ఇస్తుందని వారు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీని గురించి అన్నామలై ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిసింది. బీజేపీ అగ్రనేతల ఈ నిర్ణయంతో పార్టీ బలోపేతానికి వ్యూహరచనతో పాటు అన్నామలై తొలగింపు ఇప్పట్లో ఉండబోదని కూడా పార్టీ క్యాడర్‌కు స్పష్టం చేసినట్లు కనిపిస్తోంది. తద్వారా అన్నామలై తొలగింపుపై రేగుతున్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లే నని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



ఎన్‌సీసీ విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మేయర్ ప్రియ

వరద ముప్పును అడ్డుకుంటాం

- జీసీసీ మేయర్ ప్రియా రాజన్

ప్యారీస్, ఆగస్టు 13: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పూర్తి చేశామని, అందువల్ల భారీవర్షాలు కురిసినా వరదముప్పు రాకుండా అడ్డుకుంటామని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియా రాజన్ పేర్కొన్నారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు మేయర్ ప్రియ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జీసీసీ ఆధ్వర్యంలో రెండేళ్లలో నగరంలోని పలు ప్రాంతాల్లో వాననీటి సంరక్షణ కాల్వల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చి, పనులను కూడా పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కార్పొరేటర్ల కోరిక మేరకు ఇరుకు వీధుల్లో కూడా డ్రైనేజీలను విస్తరించేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన వర్షాలకు రోడ్లపై చేరే వరద నీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు 200 వార్డుల్లో తలా 10 మంది కార్మికులను నియమించామని, నగరంలో 33 ప్రధాన కాల్వలున్నాయని, ఈ కాలువల్లో నీటిమట్టం పెరిగే సమయంలో నీరు బయటకు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది కూడా నగరంలో నవంబరు, డిసెంబరు మాసాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ముందే హెచ్చరించిందని, అయినప్పటికీ జూన్ నుంచే వర్షాలు కురుస్తాయని తెలిపారు. వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా రాత్రి సమయంలో కురిసే వర్షాలకు రోడ్లపై వరద నీరు చేరకుండా డిజిటల్ టెక్నాలజీ ద్వారా తొలగించే పనులు జరుగుతున్నాయని, కాలువలు, సొరంగ మార్గాలను ఒకే ప్రాంతం నుంచి పర్యవేక్షించేలా రిప్పన్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, కమిషనర్ కె.గురుపరన్, ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

లేడీ సింగం ..

మహిళా ఎస్సై ధైర్యసాహసాలు

- తుపాకీతో కాల్చి రౌడీ నిర్బంధం
- సబ్ ఇన్‌స్పెక్టర్‌కు కమిషనర్ ప్రశంస





చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ నుంచి నగదు బహుమతిని అందుకుంటున్న టీపీ సత్రం ఎస్ఐ కళైసెల్వి - అరెస్టయిన రౌడీ రోహిత్‌రాజా

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్ ప్రాంతంలో పారిపోతున్న రౌడీని తుపాకీతో కాల్చి, అదుపులోకి తీసుకున్న మహిళా ఎస్ఐని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ ఎ.అరుణ్ ప్రశంసించారు. మంగళవారం వేకువజామున పోలీసులపై దాడి చేసి పారిపోతున్న రౌడీని ధైర్యసాహసాలతో పట్టుకున్నందుకు ఆమెకు నగదు బహుమతి కూడా అందజేశారు. బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య తర్వాత నగరంలో రౌడీలవేట ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రెండువేలమందికి పైగా రౌడీలను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో షెనాయ్‌నగర్‌కు చెందిన రౌడీ రోహిత్‌రాజాను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మంగళవారం వేకువజామున రోహిత్‌రాజా కీల్పాక్ సిమెట్రీగార్డెన్ వద్ద దాగినట్లు టీపీ సత్రం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ కళైసెల్వి నేతృత్వంలో హెడ్‌కానిస్టేబుళ్లు ప్రదీప్, శరవణకుమార్ తదితరులు వేకువజాము 4.30 గంటలకు ఆ ప్రాంతానికి వెళ్లారు. పోలీసులను చూసి రౌడీ రోహిత్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే హెచ్‌సీలు ప్రదీప్, శరవణకుమార్ అతడిని పట్టుకునేందుకు వెళ్లగా వారిపై వేటకొడవలితో దాడి జరిపాడు. ఈ సంఘటనలో కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ఆ తర్వాత రోహిత్‌రాజా సిమెట్రీ గార్డెన్ ప్రహరీగోడ మీదుగా దూకి సిమెట్రీ రోడ్డులో పరుగెత్తాడు. ఎస్ఐ కళైసెల్వి వెంబడించి లొంగిపోవాలని, పారిపోతే కాలుస్తానంటూ పలుమార్లు హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా రౌడీ రోహిత్‌రాజా పరుగులు తీయటంతో ఎస్ఐ కళైసెల్వి రివాల్వర్‌తో అతడి కాలిపై కాల్చారు. దీంతో అతడు రోడ్డుపై పడ్డాడు. ఆ తర్వాత ఆమె టీపీ సత్రం పోలీసులకు తెలపడంతో ఆ స్టేషన్ పోలీసు అధికారులు వెళ్లి రౌడీ రోహిత్‌రాజాను చికిత్స నిమిత్తం స్టాన్లీ ఆసుపత్రికి, గాయపడిన కానిస్టేబుళ్లు ప్రదీప్, శరవణకుమార్‌ను కీల్పాక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరెస్టయిన రౌడీ రోహిత్‌రాజాపై టీపీ సత్రం పోలీసుస్టేషన్‌లో మూడు హత్యకేసులు సహా 14 కేసులు, అమింజికరై, అశోక్‌నగర్ స్టేషన్ల పరిధిలోనూ మరికొన్ని కేసులున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ విషయం గురించి తెలుసుకున్న గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ ఎ.అరుణ్ మంగళవారం ఉదయం ఎస్ఐ కళైసెల్విని తన కార్యాలయానికి ఆహ్వానించి ఆమెను నగదు బహుమానం, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ఆ పరిస్థితి ఉత్పన్నమైతే
ఉరేసుకుంటాం


బీజేపీతో పొత్తుపై సెల్లూర్ రాజు సంచలన వ్యాఖ్యలు



అడయార్, ఆగస్టు 13: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేటాయించే సీట్లు తీసుకుని, బీజేపీ అధిష్టానం నిర్ణయాన్ని అంగీకరించాల్సిన పరిస్థితే ఉత్పన్నమైతే ఉరేసుకుంటామని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సెల్లూరు కె.రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. మదురై జిల్లా సమయనల్లూరు సమీపంలోని పరవై గ్రామంలో అన్నాడీఎంకే ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు ఇచ్చే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాజు ప్రసంగిస్తూ... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై నిన్న పడిన వర్షానికి మొలకెత్తిన విత్తనం వంటివారని, ఆయనంటే తనకు ఎప్పుడూ నచ్చదన్నారు. అన్నాడీఎంకే నేతలే ఆయన వద్దకు పొత్తుకెళ్ళినట్టుగా మాట్లాడుతూ అన్నాడీఎంకేతో తమకెలాంటి సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. 70 యేళ్ళ ద్రావిడ పాలన గురించి విమర్శించే అర్హత అన్నామలైకు ఉందా అని ప్రశ్నించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గిపోవడానికి అన్నామలై వంటి నేతల వ్యవహారశైలే కారణమని మాజీ మంత్రి సెల్లూర్ రాజు అన్నారు.

గవర్నర్ తేనేటి విందును
బహిష్కరించిన విపక్షాలు

- కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే నిర్ణయం
- రాజకీయ వర్గాల్లో చర్చ



అడయార్, ఆగస్టు 13: భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు (ఎట్ హోం)ను డీఎంకే కూటమి పార్టీలు బహిష్కరించాయి. ఈ మేరకు ఆ కూటమి పార్టీలైన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకేలు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో వెల్లడించాయి. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహారశైలి ప్రారంభం నుంచి ఇప్పటివరకు వివాదాస్పదంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నేతలు, సంఘ సేవకులు, సామాజిక కార్యకర్తలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఇలా అనేక మందిని ఆహ్వానించనున్నారు. అయితే, ఈ తేనీటి విందును కాంగ్రెస్, సీపీఎం, సీపీఎం, ఎండీఎంకే పార్టీల అధినేతలు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించాయి.

టీఎన్‌పీఎస్సీ చైర్మన్‌గా ప్రభాకర్ నియామకం



ఎస్‌కే ప్రభాకర్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి నందకుమార్ మంగళవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ఈ పదవిలో ఆయన ఆరేళ్లపాటు, లేదా ఆయనకు 62 ఏళ్లు వచ్చే వరకు కొనసాగనున్నారు. విరుదునగర్‌కు చెందిన ప్రభాకర్ 1989వ సంవత్సరం రాష్ట్ర బ్యాచ్‌కు చెందినవారు. ఆయన వయస్సు 58 యేళ్లు. రాష్ట్ర హైవేస్ మినీ ఓడరేవుల శాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర హోంశాఖ కార్యదర్శిగా సేవలందించారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్న ప్రభాకర్ టీఎన్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమితులయ్యారు.

సమాచార దర్శిని

28 నుంచి వాలీబాల్ పోటీలు

ఐసిఎఫ్, ఆగస్టు 13: చెన్నై జిల్లా వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో లీగ్ వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలు ఎగ్మూర్‌లో ఉన్న మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి 31వ తేది వరకు జరుగనున్నాయి. మహిళా విభాగంలో పోటీలు 28 నుంచి 30 వరకు, పురుషుల విభాగం పోటీలు 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గుర్తింపు పొందిన క్లబ్‌లు, కళాశాలలు పాల్గొనవచ్చు. ఈ నెల 23వ తేదిలోపు chennaidistrictvolleyballassn@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాలో పేరు నమోదుచేసుకోవాలని వాలీబాల్ సంఘం నిర్వాహకులు తెలిపారు.

17న అమెరికా ఉన్నత విద్యా ప్రదర్శన

ఐసిఎఫ్, ఆగస్టు 13: అమెరికాలో ఉన్నత విద్యా అవకాశాలకు సంబంధించిన విద్యా ప్రదర్శన నగరంలో ఉన్న అమెరికా దౌత్య కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేది జరుగనుంది. ప్రపంచవ్యాప్తంగా 175కు పైగా దేశాల్లో 430కు పైగా అంతర్జాతీయ విద్యార్థుల సలహా కేంద్రాలతో ఎడ్యుకేషన్ యూఎస్ఏ అనే అమెరికా ప్రభుత్వ విద్యాశాఖ సంస్థ పనిచేస్తోంది. దీని ఆధ్వర్యంలో దేశంలో 8 ప్రాంతాల్లో అమెరికాలో ఉన్న విద్యా అవకాశాలపై ప్రదర్శన ఈ నెల 16 నుంచి 25వ తేది వరకు జరుగనుండగా, చెన్నైలో 17వ తేది హిల్టన్ హోటల్‌లో ఈ ప్రదర్శన జరుగనుంది. అమెరికా అంగీకారం పొందిన 80 విద్యాసంస్థల ప్రతినిధులు ఉన్నత విద్య అవకాశాలపై విద్యార్థులకు వివరించనున్నారు. ఇతర వివరాలకు bit.ly/EdUSAFair24Emb అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

1,120 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం, శని, ఆదివారాల సెలవులు పురస్కరించుకుని చెన్నై నుంచి ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది. 14 నుంచి 17వ తేది వరకు చెన్నై నుంచి మొత్తం 1,120 బస్సులు నడుపనున్నారు. ప్రయాణికులు 'టీఎన్ఎస్‌టీసీ' వెబ్‌సైట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.

16న ప్రైవేటు జాబ్ మేళా

పెరంబూర్, ఆగస్టు 13: కాంచీపురం జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 16వ తేది ఉదయం 9.30 గంటల నుంచి ప్రైవేటు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమో, ఐటీఐ, 10,12 తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్లలోపున్న వారు జిల్లాకు చెందిన యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికేట్లు, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. వివరాలకు 044-27237124 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ముఖ్యమంత్రి ట్రోఫీకి ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 13: ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీలకు ఈ నెల 25వ తేది వరకు ఔత్సాహికులు పేరు నమోదుచేసుకోవచ్చు. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ముఖ్యమంత్రి ట్రోఫీ క్రీడా పోటీలు సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరుగనున్నాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, దివ్యాంగులు, జనరల్ విభాగాలు లాఆ ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. 27 క్రీడల్లో 53రకాల జిల్లా, మండల, రాష్ట్రస్థాయి పోటీలు జరుగనున్నాయి. వీటిలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదిలోపు పేరు నమోదుచేసుకోవాలి. ఇతర వివరాలకు 7401703480 అనే నెంబరు సంప్రదించవచ్చు.

21న పాత వాహనాల వేలం

ఐసిఎఫ్, ఆగస్టు 13: పోలీసు శాఖలో ఉన్న పాత వాహనాలను ఈ నెల 21వ తేది వేలం ద్వారా విక్రయించనున్నట్లు రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ కార్యాలయం తెలిపింది. 11 నాలుగు చక్రాల వాహనాలు, 7 ద్విచక్రవాహనాలు, 11 ఇతర వాహనాలను మైలాపూర్‌లో ఉన్న పోలీసు డైరెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 11.30 గంటలకు వేలం వేయనున్నారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 20వ తేది సాయంత్రం 5 గంటలకు వాహనాలను చూసేందుకు అనుమతి కల్పించారు. 19,20 తేదీల్లో డిపాజిట్‌గా రూ.1,000 చెల్లించి పేరు నమోదుచేసుకోవాలి. వేలంలో వాహనం పొందే వారు వెంటనే మిగిలిన సైకం చెల్లించాలని అధికారులు సూచించారు.

దీపావళికి విమాన టిక్కెట్ల పెంపు

ఐసిఎఫ్, ఆగస్టు 13: దీపావళి విమాన టిక్కెట్ల ఛార్జీలు పెరిగాయి. అక్టోబరు 31వ తేది దీపావళి పండుగను పురస్కరించుకొని చెన్నై వంటి నగరాల్లో నివసించే వారు సొంతూర్లకు వెళ్లేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. విమానంలో పయనించే వారు టిక్కెట్లు బుకింగ్ చేసుకుంటున్నారు.90రోజులకు ముందే విమాన బుకింగ్ టిక్కెట్లు ప్రారంభం కావడంతో ఛార్జీలు పెరిగాయి. అక్టోబరు 30 నుంచి నవంబరు 5వ తేది టిక్కెట్లు బుకింగ్ చేసుకొనే వారి సంఖ్య పెరగడంతో టిక్కెట్ల సంఖ్య, ధరలు పెంచారు. ముంబై-చెన్నై రూ.5,083, ఢిల్లీ-చెన్నై రూ.7,618గా పెరిగింది. దీపావళి దగ్గర పడే కొద్దీ ఛార్జీలు మరింతపెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

16న శ్రీలంక ప్యాసింజర్ నౌక ప్రారంభం

ఐసిఎఫ్, ఆగస్టు 13: భారతదేశం-శ్రీలంక మధ్య వాణిజ్యం, పర్యాటకాభివృద్ధి కోసం ప్యాసింజర్ నౌక రవాణాను ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్నారు. గత ఏడాది అక్టోబరు 14న ఈ సేవలను ప్రధాన మంత్రి ప్రారంభించగా, కొన్ని రోజుల్లోనే రవాణా సేవలు నిలిచిపోయాయి. అనంతరం ప్రైవేటు సంస్థకు ఈ సేవలు అప్పగించారు. గత మేలో రవాణా ప్రారంభించనున్నట్లు ప్రకటించినప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, ఈ నెల 16వ తేది నుంచి సేవలు పునఃప్రారంభం కానున్నాయి. ఆ రోజు ఉదయం 8 గంటలకు నాగపట్టణం నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు చేరుకోనుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరి సాయంత్రం 6 గంటలకు నాగపట్టణం చేరనుంది. నౌక కింది అంతస్తులో ప్రయాణించేందుకు రూ.5,000, పై అంతస్తులో ప్రయాణించేందుకు రూ.7,500 ఛార్జీ నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ

ఐసిఎఫ్, ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్‌పై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఈకాట్టుతాంగల్ సిడ్కో ఎస్టేట్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో జరిగే శిక్షణలో మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియాలు, మార్కెటింగ్ నైపుణ్యత తదితర అంశాలపై నిపుణులు వివరణ ఇస్తారు. వివరాలకు 044-22252081, 9841336033 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

గంజాయి స్వాధీనం కేసు ...
సవుక్కు శంకర్‌పై మళ్లీ గూండాచట్టం

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యూట్యూబర్ సవుక్కు శంకర్ మళ్లీ గూండా చట్టం కింద అరెస్టయ్యారు. గతంలో తేని జిల్లాలో బసచేసినప్పుడు ఆయన వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని పీసీ పట్టి పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసు తదుపరి విచారణలో భాగంగా పీసీపట్టి పోలీసులు, తేని జిల్లా ఎస్పీ సిఫారసు మేరకు జిల్లా కలెక్టర్ ఆయనపై గూండా చట్టం ప్రయోగించేందుకు అనుమతించారు. మహిళా పోలీసులను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారనే నేరారోపణలపై సవుక్కు శంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ సందర్భంగా ఆయనను గూండా చట్టం కింద అరెస్టు చేశారు. ఆ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు సవుక్కు శంకర్‌పై ప్రయోగించిన గూండా చట్టాన్ని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. రెండు రోజులకు ముందు పోలీసులు ఆయనను చెన్నై పుళల్ సెంట్రల్ జైలు నుంచి మదురై సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో గతేడాది అక్టోబర్‌లో స్వాతంత్ర్య సమర యోధుడు ముత్తురామలింగదేవర్ కీర్తి ప్రతిష్టలను దిగజార్చే విధంగా వ్యాఖ్యలు చేశారనే నేరారోపణపై కోయంబత్తూరు రేస్‌కోర్స్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు గాను ఆయనను మూడు రోజులపాటు కస్టడీలోకి తీసుకునేందుకు అనుమతించాలని పోలీసులు కోయంబత్తూరులోని 4వ క్రిమినల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు సవుక్కు శంకర్‌ను ఒక రోజు మాత్రమే కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపేందుకు రేస్‌కోర్స్ పోలీసులకు అనుమతి జారీ చేసింది.


కోవై కోర్టులో హాజరయ్యేందుకు వెళ్తున్న సవుక్కు శంకర్

బస్సు ఛార్జీలు పెంచే ఉద్దేశం లేదు
● స్పష్టం చేసిన రవాణా శాఖ



పెరంబూర్, ఆగస్టు 13: రాష్ట్రంలో ప్రభుత్వ బస్సు ఛార్జీలు పెంచే ఉద్దేశం లేదని రవాణా శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో 8 ప్రభుత్వ రవాణా శాఖ రీజియన్ల పరిధిలో ప్రతిరోజు 20,000లకు పైగా బస్సులు నడుపుతుండగా, 1.76 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2018లో ప్రభుత్వ బస్సు ఛార్జీలు పెంచారు. ఆంధ్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలతో పోల్చితే రాష్ట్రంలో బస్సు ఛార్జీలు తక్కువగా ఉన్నాయి. డీజిల్ ఖర్చుకు అనుగుణంగా బస్సు ఛార్జీలు పెంచే విషయమై కమిషన్ ఏర్పాటుచేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు వెలువడ్డాయి. దీనిని పీఎంకే రాష్ట్ర అధ్యక్షుడు డా.అన్బుమణి తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలో బస్సు ఛార్జీలు పెంచే ఆలోచన లేదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను రాష్ట్రప్రభుత్వం చేపట్టదని స్పష్టం చేసింది.

పారిశుధ్య కార్మికుల నిజాయితీ


కార్మికులను అభినందిస్తున్న మదురై మేయర్ ఇంద్రాణి, కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

పెరంబూర్, ఆగస్టు 13: చెత్తలో లభించిన నగదును తిరిగి యజమానికి అప్పగించిన పారిశుధ్య కార్మికులను పలువురు అభినందించారు. మదురై కార్పొరేషన్ 12 వార్డు పరిధిలోని భారతీయార్ మెయి న్ రోడ్డు ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు శేఖర్, పెరుమాళ్, వలివిట్టాన్ సోమవారం చెత్తను తొలగిస్తున్నారు. సేకరించిన చెత్తను విభజించే సమయంలో వారికి రూ.10,000 నగదు కనిపించింది. దీంతో వారు వెంటనే కార్పొరేషన్ అధికారులకు తెలియజేశారు. అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించగా, అదే ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్‌కు చెందినదని, చెత్త కుండీల్లో పొరపాటున పడేసినట్లు తెలిసింది. దీంతో, ఆ నగదును ఇస్మాయిల్‌కు అందజేశారు. విషయం తెలిసిన మేయర్ ఇంద్రాణి, కమిషనర్ దినేష్‌కుమార్ మంగళవారం కార్పొరేషన్ కార్యాలయానికి కార్మికులు శేఖర్, పెరుమాళ్, వలివిట్టాన్‌ను రప్పించి, వారిని సత్కరించి నగదు బహుమతి అందజేసి అభినందించారు.

ఉత్తర రాష్ట్రాలకు పెరిగిన సగ్గు బియ్యం ఎగుమతి

ఐసిఎఫ్, ఆగస్టు 13: శ్రావణ మాసంలో సగ్గుబియ్యం ఎగుమతులు ఉత్తర రాష్ట్రాలకు పెరిగాయి. సేలం కురంగుచావిడిలో ఉన్న సంస్థకు సేలం, నామక్కల్, కళ్లకుర్చి, ధర్మపురి, ఈరోడ్, తిరుప్పూర్ సహా వివిధ ప్రాంతాల నుంచి సగ్గుబియ్యం, స్టార్చ్ ఎక్కువగా దిగుమతవుతుంటాయి. ఇతర రాష్ట్రాల కన్నా సేలంలో లభించే సగ్గుబియ్యం నాణ్యతగా ఉండడంతో ఉత్తరాదికి చెందిన వ్యాపారులు హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తుంటారు. వారి ఆహార వస్తువుల్లో ప్రధానంగా దీనిని ఉపయోగిస్తుండడంతో ఎక్కువగా ఎగుమతి జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఉత్తర రాష్ట్రాల్లో ఎక్కువ మంది జరుపుకొనే శ్రావణ మాస దీక్షలు ప్రారంభమయ్యాయి. దీంతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలకు సగ్గుబియ్యం బస్తాలు ఎగుమతవుతున్నాయి. గత నెలలో రోజుకు 3,000 నుంచి 4,000 బస్తాలు విక్రయం కాగా, ప్రస్తుతం 10,000 బస్తాలకు పైగా అమ్ముడుపోతున్నాయి. వినాయక చవితి, నవరాత్రి పండుగలకు సగ్గుబియ్యం విక్రయాలు మరింత పెరుగుతాయని,ఈరెండు నెలల్లో 7నుంచి 8 లక్షల టన్నుల సగ్గుబియ్యం ఎగుమతులు జరుగుతాయని వ్యాపారులు తెలిపారు.

కూడన్‌కుళంలో విద్యుదుత్పత్తికి ఒప్పందాలు

ఐసిఎఫ్, ఆగస్టు 13: కూడన్‌కుళంలో విద్యుదుత్పత్తికి రూ.10,000 కోట్లతో భారతదేశం-రష్యా మధ్య ఒప్పందాలు జరిగాయి. తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళంలో భారత్-రష్యా దేశాలు సంయుక్తంగా అణు ప్లాంట్లు ఏర్పాటుచేశాయి. ఇక్కడ తలా 1,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు పనిచేస్తున్నాయి. మరో రెండు యూనిట్లు ఏర్పాటుచేస్తున్నారు. త్వరలో ఈ పనులు పూర్తిచేసి విద్యుదుత్పత్తి ప్రారంభించనున్నారు. రెండు యూనిట్లలో ఇంధనంగా యురేనియం వినియోగిస్తున్నారు. ఈ ఇంధనం నింపేందుకు ఏడాదికి ఒకసారి రెండు నెలలు ఉత్పత్తి నిలిపివేస్తున్నారు. భారత్-రష్యా ఒప్పందం ప్రకారం, రష్యా సంస్థ రోసాగామ్ యురేనియం సరఫరా చేస్తోంది. ఈ ఇంధనానికి ప్రత్యామ్నాయంగా కొత్త ఇంధనం ఉత్పత్తి పనులను ఆ సంస్థలో భాగమైన టీవీఈఎల్‌జేఎస్సీ అనే సంస్థ ప్రారంభించింది. ఇందుకోసం రష్యా-భారత్ మధ్య రూ.10,500 కోట్లకు ఒప్పందాలు జరిగాయి.

వేలాంకన్ని-ముంబై మధ్య ప్రత్యేక రైళ్లు

ఐసిఎఫ్, ఆగస్టు 13: ఆరోగ్య మాత చర్చి ఉత్సవాలను పురస్కరించుకుని వేలాంకన్ని-ముంబై మధ్య ప్రత్యేక రైలు నడుపనున్నారు. నాగపట్టణం జిల్లా వేలాంకన్ని ఆరోగ్య మాత ఆలయ ఉత్సవాలు ఈ నెల 29వ తేది ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ముంబై నుంచి 26వ తేది మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు రాత్రి 11.50 గంటలకు వేలాంకన్ని చేరుతుంది. మరో మార్గంలో వేలాంకన్ని నుంచి 28వ తేది వేకువజామున 3 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు సాయంత్రం 4.20 గంటలకు ముంబై చేరుకుంటుంది. అదే విధంగా ముంబై నుంచి సెప్టెంబరు 7వ తేది మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు రాత్రి 11.50 గంటలకు వేలాంకన్ని చేరుకుంటుంది. మరోమార్గంలో వేలాంకన్ని నుంచి సెప్టెంబరు 9వ తేది వేకుజామున 3 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు సాయంత్రం 4.20 గంటలకు ముంబై చేరుకుంటుంది. ఈ రైళ్ల టిక్కెట్ రిజర్వేషన్ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది.

వైభవంగా సుందరి అమ్మవారి వేడుకలు


అన్నదానం చేస్తున్న డీఎంకే సెక్రటరీ వినాయగం

వేలూరు, ఆగస్టు 13: స్థానిక కాట్పాడి సమీపం కి లి త్తా న్ ప ట్ట రై ప్రాంతంలో ఉన్న సుందరి అమ్మవారి ఆలయ 22వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, ఆరాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో 5వ డివిజన్ డీఎంకే సెక్రటరీ, రియల్ ఎస్టేట్ ప్రముఖుడు వినాయకమ్, కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెయ్యి మందికి అన్నదానం చేశారు.

కైనెమాటిక్ చార్జర్ ఆవిష్కరణ


చార్జర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మెయ్యనాథన్ శివ

అడయార్, ఆగస్టు 13: సోలార్ ఇంటిగ్రేటెడ్ నెక్స్ జనరేషన్ రూపొందించిన కైనెమాటిక్ చార్జర్‌ను రాష్ట్ర పర్యావరణ శాఖామంత్రి మెయ్యనాథన్ శివ నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ నెక్స్ జనరేషన్ చార్జర్ తయారీ కోసం చెన్నైకు చెందిన ఫిజిక్స్ సోలా ర్ ఇన్నోవేషన్, స్విచింగ్ బ్యాటరీ ఇంక్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుని సింగా టెక్నాలజీ (సోలార్ ఇంటిగ్రేటెడ్ నెక్స్ జెన్ ఆర్కిటెక్చర్)ని అందుబాటులోకి తీసుకొచ్చి, కైనెమాటిక్ చార్జర్ కేసీ5విని ఆవిష్కరించింది. ఐక్యరాజ్య సమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ 7కి అనుగుణంగా కాంపాక్ట్ సౌరశక్తి ఉపయోగించి స్మార్ట్‌ఫోన్లు, ఇతర పరికరాలకు చార్జింగ్ చేసేందుకు ఇది దోహదపడనుంది. ఈ సోలార్ చార్జర్ ద్వారా ఒక స్మార్ట్‌ఫోన్‌ను కేవలం 90 నిమిషాల్లో చార్జ్ చేసే అవకాశం ఉందని స్విచింగ్ బ్యాటరీ ఇంక్ ఫౌండర్, సీఈవో కన్నప్పన్ చెట్టియార్ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పురుషులు మాత్రమే పాల్గొనే వేడుక
● 2 వేల మందికి మాంసాహార విందు

అడయార్, ఆగస్టు 13: దిండిగల్ జిల్లాలో కేవలం పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దాదాపు 2 వేల మందికి మాంసాహార విందు భోజనం వడ్డించారు. జిల్లాలోని నత్తం సమీపంలో నడువనూరు గ్రామంలో కరుప్పుస్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రతి యేటా ఆడి మాసంలో వేడుకలను నిర్వహిస్తుంటారు. ఇందులోభాగంగా సోమవారం రాత్రి జరిగిన వేడుకల్లో 25కు పైగా మేకపోతులను బలిచ్చి, వివిధ రకాల వంటలను తయారు చేసి, ఈ వేడుకల్లో పాల్గొన్న సుమారు 2 వేల మంది పురుషులకు విందు భోజనం వడ్డించారు.

విద్యుత్‌ఛార్జీల పెంపును ఖండిస్తూ
వాణిజ్య సంఘాల సమాఖ్య ధర్నా

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల పెంపు, వృత్తిపన్ను పెంపు, దుకాణాల వద్ద కార్పొరేషన్ అధికారులు నేమ్‌బోర్డులను తొలగించటాన్ని తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్ర వాణిజ్య సంఘాల సమాఖ్య నేతలు, సభ్యులు మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద జరిగిన ఈ ఆందోళనకు సమాఖ్య అధ్యక్షులు వెల్లయన్ నాయకత్వం వహించారు. సమాఖ్యకు చెందిన ప్రముఖులు పది. దేవరాజ్, ఎస్.దురైమాణిక్కం, ఎం. ఇమ్మానువేల్, జయశీలన్, ఆలందూరు పి. గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పాఠ్యపుస్తకాల ధరలు

ఐసిఎఫ్, ఆగస్టు 13: రాష్ట్రంలో పాఠ్యపుస్తకాల ధరలు పెరిగాయి. 1 నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల ధరలు పెంచుతూ పాఠ్యగ్రంథ సంస్థ ప్రకటించింది. ఆ ప్రకారం, 1వ తరగతి పుస్తకాలు రూ.16 పెరిగి రూ.550కు విక్రయమవుతున్నాయి. 2వ తరగతి పుస్తకాలు రూ.150 పెరిగి రూ.530, 3వ తరగతి పుస్తకాలు రూ.190 పెరిగి రూ.620, 4వ తరగతి పుస్తకాలు రూ.180 పెరిగి రూ.650, 5వ తరగతి పుస్తకాలు రూ.200 పెరిగి రూ.710, 6వ తరగతి పుస్తకాలు రూ.320 పెరిగి రూ.1,110, 7వ తరగతి పుస్తకాలు రూ.340 పెరిగి రూ.1,200కు విక్రయమవుతున్నాయి. ఇక, 8వ తరగతి పుస్తకాలు రూ.310 పెరిగి రూ.1,000, 9వ తరగతి పుస్తకాలు రూ.340 పెరిగి రూ.1,010, 10వ తరగతి పుస్తకాలు రూ.340 పెరిగి రూ.1130కి విక్రయమవుతున్నాయి.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ
● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 13: ధర్మపురి జిల్లా మహేంద్రపురం సమీపంలోని సింగేరి ప్రాంతంలో ఉన్న ఓ ఇంట్లో చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ చేసే పరీక్షలు నిర్వహించిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణపై అందజేసిన సమాచారంతో ఆరోగ్య, గ్రామీణ సంక్షేమ పనుల శాఖ జాయింట్ డైరెక్టర్ డా.శాంతి జారీచేసిన ఉత్తర్వుల మేరకు ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం ఉదయం సంబంధిత ఇంట్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న నలుగురిని అదుపులోకి తీసుకొని జరిపిన విచారణలో... లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. దీంతో కర్పగం (39), వడివేలు (40)లను అరెస్ట్ చేసి పరారైన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

అంబత్తూరు క్రైం ఎస్ఐ హఠాన్మరణం

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అంబత్తూరు పోలీసుస్టేషన్‌లో క్రైం విభాగం ఎస్ఐగా పనిచేస్తున్న శరవణన్ (51) ఆకస్మికంగా మృతి చెందారు. తిరుముల్లైవాయల్ ప్రాంతంలో నివసిస్తున్న ఎస్ఐ శరవణన్‌కు మాలా అనే భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పది రోజుల క్రితం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స తీసుకున్నారు. రెండు రోజులకు ముందు ఆయన డ్యూటీలో చేరారు. మంగళవారం రాత్రి పది గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లి దోసె తింటుండగా పొరపోయింది. దీంతో ఊపిరాడక బాధపడ్డారు. వెంటనే ఆయనను కుటుంబీకులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు ప్రకటించారు.

వేలూరులో భారీవర్షం
● రోడ్లపై నిలిచిన నీరు

వేలూరు, ఆగస్టు 13: నగరంలో రెండు రోజులుగా భారీవర్షం కురుస్తోంది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాట్పాడి, ముత్తమిళ్ నగర్ సహా పలు ప్రాంతాల్లో నిలిచిన నీటిని యంత్రాలతో సత్వరం తొలగించాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. రోడ్లపై ఉన్న గుంతల్లో వాహనాలు చిక్కుకోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. చిత్తూరు బస్టాండ్ నుంచి కాట్పాడి రోడ్డు వరకు వర్షపు నీరు అధికంగా రోడ్లపై చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక, కిలిత్తాన్‌పట్టరైలో ఉన్న కోర్టు ప్రాంగణంలో భారీగా నీరు చేసి చిన్న చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఆమె వెంట కార్పొరేషన్ కమిషనర్ జానకి, మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత తదితరులున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాట్పాడి సహా పలు ప్రాంతాల్లో రాత్రి 14 సెం.మీ వర్షం కురిసిందన్నారు. రోడ్లపై నిలిచిన నీటిని పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.


కోర్టు ప్రాంగణంలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి - రోడ్లపై నిలిచిన నీటిని యంత్రాలతో తొలగిస్తున్న కార్మికులు

టాస్మాక్ మద్యం దుకాణం కోసం
నడుంబిగించిన మహిళా లోకం


ధర్మపురి కలెక్టరేట్ వద్ద గుమికూడిన మహిళలు

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా అతనూరులో టాస్మాక్ మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని సుమారు 10 గ్రామాలకు చెందిన మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం కూడా సమర్పించారు. అతనూరు గ్రామం, దాని చుట్టూ ఉన్న మరి కొన్ని గ్రామాలకు చెందిన పురుషులు మద్యం తాగాలంటే 22 కి.మీ.ల దూరంలో ఉన్న ధర్మపురి టాస్మాక్ మద్యం దుకాణానికి, 20 కి.మీ.ల దూరంలో ఉన్న జక్కంపట్టిలోని మద్యం దుకాణాని వెళ్ళాల్సి ఉంది. అలా ఇంటి నుంచి ఆ రెండు మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించిన తమ వారంతా ఇంటికి భద్రంగా తిరిగి వస్తారనే నమ్మకం సన్నగిల్లుతోందని మహిళలు పేర్కొన్నారు. దీనికి తోడు తమ గ్రామాలలో కొందరు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని, మత్తును పెంచే విధంగా ఆ మద్యంలో కొన్ని రసాయనాలు కూడా కలుపుతున్నారని దూరంలో ఉన్న టాస్మాక్‌కు వెళ్లలేని వీరంతా ఈ కల్తీ మద్యం తాగి కళ్లకుర్చిలా కల్తీ సారా దుర్ఘటనలు తమ గ్రామాల్లో సంభవిస్తాయని మహిళలు భీతిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో అతనూరు తదితర గ్రామాలకు చెందిన మహిళలు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గ్రామంలో టాస్మాక్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు.

అశ్వత్థామన్‌కు నాలుగు రోజుల కస్టడీ

పెరంబూర్, ఆగస్టు 13: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన అశ్వత్థామన్‌ను నాలుగు రోజులు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. హత్య కేసు విషయమై అశ్వత్థామన్‌ను విచారించేందుకు ఏడు రోజులు కస్టడీకి అనుమతించాలని కోరుతూ పోలీసులు ఎగ్మూర్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

ప్రమాదంలో ఎస్ఐ బ్రెయిన్ డెడ్
● అవయవాల దానం

అడయార్, ఆగస్టు 13: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఎస్ఐ అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. నగర శివారు ప్రాంతమైన ముదుచూరు ప్రాంతానికి చెందిన పళని (58) నజరత్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ ఈయన తన భార్య భువనేశ్వరితో కలిసి పూందమల్లి మార్కెట్‌కు వెళ్ళి కిరాణా సరకులు కొనుగోలు చేసి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో చిన్నవలర్‌పురం సమీపంలో టైరు పంక్చర్ కావడంతో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న పల్లంలో పడిపోయారు. ఈ ప్రమాదంలో పళని తలకు బలమైన గాయం తగిలింది. దీంతో ఆయనను శ్రీపెరంబుదూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్టు ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు ముందుకు వచ్చిన అవయవాలను దానం చేశారు. ఈ సందర్భంగా పళని కుటుంబ సభ్యులను వైద్యులు అభినందించారు.

ఆటోను ఢీకొన్న లారీ: డ్రైవర్ మృతి

అడయార్, ఆగస్టు 13: స్థానిక పోరూర్ సమీపంలో లారీ ఒకటి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు. వండలూరు సమీపంలోని మేల్‌కోట్టయూరు ప్రాంతానికి చెందిన షాజహాన్ (30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన మంగళవారం ఉదయం తాంబరం - మధురవాయల్ రోడ్డులో పోరూర్ సమీపంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షాజహాన్ అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వైద్యురాలి ఇంటిలో నగల చోరీ
● చెన్నై దొంగల అరెస్టు

అడయార్, ఆగస్టు 13: ఈరోడ్‌కు చెందిన ఒక వైద్యురాలి ఇంటిలో చేతివాటం ప్రదర్శించి ఏకంగా 219 సవర్ల బంగారు నగలను చోరీ చేసిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఈరోడ్, సంపత్ నగర్‌కు చెందిన ప్రభాత్ భార్య సుప్రియ స్థానికంగా హోమియోపతి వైద్యురాలి ఉన్నారు. గత నెల 30వ తేదీన ఈమె నివాసంలో 219 సవర్ల బంగారం నగలు, రూ.55 వేల నగదు, 25 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యారు. దీనిపై ఈరోడ్ నార్త్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు... ఈ చోరీకి పాల్పడినవారిని అరెస్టు చేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో సోమవారం కరూర్ బస్టాండ్ సమీపంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా వుండటాన్ని గమనించిన ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో చెన్నై ఆవడికి చెందిన వెల్లై, మరొకరు తిరుముల్లై వాయల్‌కు చెందిన ధనశేఖర్ గా గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుంచి 149.50 సవర్ల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో దొంగ కోసం గాలిస్తున్నారు.

తిరుచ్చి ఎస్పీకి బెదిరింపులు: ఇద్దరి అరెస్టు

అడయార్, ఆగస్టు 13: తిరుచ్చి జిల్లా ఎస్పీ వరుణ్‌కుమార్‌ను బెదిరించిన కేసులో నామ్ తమిళర్ కట్చికి చెందిన ఇద్దరు కార్యకర్తలను ఆ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వరుణ్ కుమార్.. మాదకద్రవ్యాలు విక్రయించే వారితో పాటు రౌడీలపై ఉక్కుపాదం మోపే విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులను అగౌరవ పరిచేలా, బెదిరింపులకు దిగారు. దీంతో తిరుచ్చి తిల్లై నగర్ పోలీసులకు ఎస్పీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో జిల్లా ఎస్పీని విరుదునగర్ జిల్లా శివకాశికి చెందిన తిరుపతి (35), కన్నన్ (30) అనే వారిగా గుర్తించి అరెస్టు చేశారు. కేసు విచారణ జరుపుతున్నారు.

అగ్నిగుండ వేడుకల్లో బాలుడికి గాయాలు

ప్యారీస్, ఆగస్టు 13: తిరువళ్లూర్ జిల్లా ఆరంబాక్కం గ్రామంలో జరిగిన ఆలయ అగ్నిగుండ వేడుకల్లో అగ్నిగుండంలో జారిపడిన ఏడేళ్ల బాలుడికి గాయాలయ్యాయి. ఆరంబాక్కంకు చెందిన మణికంఠన్ కుమారుడు మోనీష్ (7) ఆ ప్రాంతంలో ఉన్న ఓ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కోలాహలంగా నిర్వహించిన ఆలయ జాతరలో మణికంఠన్ కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. భక్తుల దిగేందుకు ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో ఊహించని విధంగా మోనీష్ జారిపడ్డాడు. కేకేలేసిన అతడిని గుమ్మిడిపూండి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం, కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఎస్సీలకు ఆలయ ప్రవేశంపై నిషేధం
● ఏడుగురిపై అట్రాసిటీ కేసు

ప్యారీస్, ఆగస్టు 13: ఎస్సీలను ఆలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్న పంచాయతి ఛైర్మెన్ సహా ఏడుగురిపై అట్రాసిటీ కేసు నమోదైంది. తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని వలుదలంబేడు గ్రామంలో ఉన్న ఎట్టియమ్మన్ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 9వ తేది జరిగింది. అప్పుడు అగ్రవర్ణాలకు సొంతమైన మార్గం లో ఎస్సీలు ఆలయానికి రాకుండా నిషేధం విధించారు. దీనిపై పొన్నేరి సబ్ కలెక్టర్ బల్వంత్, ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ రెండు వర్గాలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆలయానికి సీలు వేసి పోలీసులు బందోబస్తు పనుల్లో పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా, ఈ సంఘటనపై శరవణన్ అందజేసిన ఫిర్యాదు మేరకు వలుదలంబేడు గ్రామానికి చెందిన దేవరాజ్, రఘునాథన్, సుబ్రమణి, పంచాయతి ఛైర్మెన్ మణిమేఘలై, ఎట్టియప్పన్, మురుగన్, మునుస్వామిలపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదుచేశారు.

నకిలీ సర్టిఫికెట్... సర్పంచ్ పదవి నుంచి తొలగింపు

ప్యారీస్, ఆగస్టు 13: నకిలీ సర్టిఫికెట్ సమర్పించి గెలుపొందిన వేలూరు జిల్లా తోలపల్లి పంచాయతి మహిళా సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించారు. రాష్ట్రంలో కొత్తగా విభజించిన 9 జిల్లాల్లోని పంచాయతీలకు 2021 అక్టోబరులో రెండు విడత ఎన్నికలు నిర్వహించారు. వేలూరు జిల్లా ఆనకట్టు యూనియన్ పరిధిలోని తోలపల్లి పంచాయతీలో ఆటో గుర్తుపై పోటీచేసిన కల్పన సురేష్ అనే మహిళ 609 ఓట్లు పొంది గెలుపొంది సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఎస్సీ జనరల్ విభాగానికి కేటాయించిన ఈ పంచాయతీకి ఇతర వర్గానికి చెందిన కల్పన ఎన్నికల నామినేషన్ సమయంలో నకిలీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సమర్పించారని, దీనిపై విచారణ జరిపి ఆమెపై చట్టపరమైన చర్యలు చేపట్టాలంటూ సర్పంచ్ పదవికి పోటీచేసి ఓటమిపాలైన భాగ్యరాజ్ జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు జరిపిన విచారణలో, కల్పన నేరానికి పాల్పడినట్లు స్పష్టం కావడంతో ఆమెను సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.



సెయింట్ జార్జి కోట సమీపంలో రిహార్సల్స్



పారా మిలిటరీ బలగాల కవాతు

పంద్రాగస్టుకు చెన్నై ముస్తాబు

- ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుద్దీపాల అలంకరణ



రిజర్వ్ పోలీసుల కవాతు

ప్యారీస్, ఆగస్టు 13: రాజధాని నగరం 78వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రత్యేక అంశాలతో ముస్తాబైంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ కార్యాలయ భవనాలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. జెండా పండుగను కోలాహలంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం భారీ ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. నగరంలో 9,000 మందికి పైగా పోలీసులు, రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సెయింట్ జార్జి కోట ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ముఖ్యమంత్రి స్టాలిన్ ఈనెల 15వ తేది ఉదయం జాతీయ జెండా ఎగురవేసి, రాష్ట్రప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. స్వాతంత్ర్య వేడుకలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఈ నెల 23వ తేది వరకు డ్రోన్లు ఎగురవేసేందుకు నిషేధం విధించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు పంద్రాగస్టు పండుగను ఉత్సాహంగా జరుపుకోనున్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. జెండా పండుగను పురస్కరించుకుని మెరీనా బీచ్ రోడ్డులోని సచివాలయ భవనం, జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం, దక్షిణ రైల్వే కార్యాలయం, డా.ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో, సచివాలయం సమీపంలో మంగళవారం చివరగా మూడో విడత రిహార్సల్స్‌ను పకడ్బందీగా నిర్వహించారు. ఇందులో త్రివిధ దళాలతో పాటు కమాండో, రిజర్వ్ తదితర 13 విభాగాల పోలీసులు నిర్వహించిన కవాతు నగరవాసులను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి నివాసం నుంచి సెయింట్ జార్జి కోట వరకు సీఎం స్టాలిన్‌ను వాహనంలో రావడం, జెండా ఎగురవేయడం, పోలీసుల గౌరవ వందనం స్వీకరించడం తదితర కార్యక్రమాలను పోలీసు అధికారులు రిహార్సల్స్ రూపంలో నిర్వహించారు.



కొరట్టూరులోని జైగోపాల్ కరోడియా పాఠశాల విద్యార్థుల భారీ జాతీయ జెండాతో ప్రదర్శన



త్రివర్ణ వెలుగుల్లో సచివాలయ భవనం



ముఖాలపై త్రివర్ణ పతాకాల పెయింటింగ్‌తో విద్యార్థులు

ఘనంగా 'తరంగ శక్తి' ముగింపు వేడుకలు



ముగింపు వేడుకల్లో గవర్నర్ ఆర్‌ఎన్ రవి

పెరంబూర్, ఆగస్టు 13: కోయంబత్తూర్ సూలూరు వైమానిక దళం మైదానంలో నిర్వహిస్తున్న 8 రోజుల 'తరంగ శక్తి 2024' అంతర్జాతీయ వైమానిక దళ ఉమ్మడి విన్యాసాలు మంగళవారంతో ముగిశాయి. భారత్, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, ఇంగ్లాండ్ తదితర వైమానిక దళాలు ఈ నెల 6 నుంచి సంయుక్త విమాన శిక్షణ నిర్వహించాయి. మంగళవారం జరిగిన ముగింపు వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై, వైమానిక దళం పరేడ్ గౌరవాన్ని స్వీకరించారు. అనంతరం భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లు, తేజస్, సుఖాయ్, మిగ్ యుద్ధ విమానాల్లో సైనికులు చేసిన పలు సాహసాలను గవర్నర్ వీక్షించారు. జర్మన్ దేశానికి చెందిన టైఫూన్ యుద్ధవిమానాలు, రాఫెట్ జెట్‌లు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా ఉమ్మడి వైమానిక విన్యాసాల్లో పాల్గొన్న వివిధ దేశాలకు చెందిన ఎయిర్ ఫోర్స్ కమాండ్లను గవర్నర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. తొలుత ఎయిర్‌ఫోర్స్ బేస్ కాంప్లెక్స్‌లో మిలిటరీ ఎక్విప్‌మెంట్ ఎగ్జిబిషన్‌ను గవర్నర్ సందర్శించారు.



హెలికాప్టర్ల ప్రదర్శన

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

- డా.సీఎంకే రెడ్డి పిలుపు

ప్యారీస్, ఆగస్టు 13: ప్రతి ఒక్కరు జాతీయ భావాన్ని పెంపొందించుకుని స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు అలవర్చుకొని సమాజాభివృద్ధిలో తమవంతు భాగస్వాములు కావాలని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీఎఫ్ ఉపాధ్యక్షులు, నమో గాడ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.సీఎం కిషోర్ 49వ జన్మదిన వేడుకలను కీల్పాక్కంలోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, విద్యార్థులకు నూతన వస్త్రాలు, త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ఏఐటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాయకర్ ఆర్. నందగోపాల్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి ఇశ్రాయేలు, నగర ప్రముఖులు డా.ఎస్.నాగభూషణం, తాళ్లూరి సురేష్, వీజీ జయకుమార్, కేవీ జనార్ధనం, కేఎల్ కిరణ్, పోరూరి శ్రీనివాసరావు, లయన్ జి.మురళి, ఎమ్మార్ సుబ్రమణ్యం, కుంకు దశరథరావు, సీహెచ్ తిరుమలరావు, డా.హనుమంతరావు సహా కనకదుర్గ తెలుగు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని కిషోర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యార్థులతో డా.సీఎంకే రెడ్డి, డా.సీఎం కిషోర్ తదితరులు

కార్యక్రమంలో సీఎంకే రెడ్డి మాట్లాడుతూ... 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ సంస్థ తరపున 'హర్ ఘర్ తిరంగ్' కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరంలో ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకొని వారికి నివాళులర్పించాలని తెలిపారు. వారి పోరాట ఫలితం వల్లే మనం నేడు స్వేచ్ఛగా గాలి పీల్చుకుంటున్నామని, జెండా పండుగ రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిస్తూ, అందరికి పంద్రాగస్టు శుభాకాంక్షలు తెలియజేశారు.

ర్యాంక్ సాధించిన మద్రాసు వైద్యకళాశాల

ప్యారీస్,ఆగస్టు13: దేశంలోని ఉత్తమ ప్రభుత్వ వైద్య కళాశాలలకే కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన ర్యాంకుల జాబితాలో మద్రాసు వైద్య కళాశాల (ఎంఎంసీ) 10వ స్థానంలో నిలిచింది. బోధన, సిబ్బంది సౌకర్యాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న యూజీ, పీజీ కోర్సుల వైద్యకళాశాలల్లో జాతీయస్థాయిలో ర్యాంకు సాధించింది. ఈ ప్రశంసా పత్రాలతో ఎంఎంసీ ప్రిన్సిపాల్ డా.తేరణిరాజన్, వైస్ ప్రిన్సిపాల్ డా.కవిత, నోడల్ ఆఫీసర్ అన్బుసెల్వి మంగళవారం ఉదయం సచివాలయానికి వెళ్లి ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం కలిసారు. 2024వ సంవత్సరం ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల జాబితాలో స్థానం దక్కించుకున్న ఎంఎంసీ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.



ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యంతో ఎంఎంసీ ప్రిన్సిపాల్ తేరణిరాజన్, వైస్ ప్రిన్సిపాల్ డా.కవిత తదితరులు

సవితా ఇంజనీరింగ్ కాలేజీకి ఫ్లెక్సీలెర్న్ గుర్తింపు



గుర్తింపు పత్రాన్ని స్వీకరిస్తున్న సవితా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక అధ్యక్షులు డా. ఎన్‌ఎం వీరయ్యాన్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానానికి ఊతమిచ్చే దిశగా ఎంపిక ఆధారిత పరపతి విధానాన్ని ప్రవేశపెట్టి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతస్థితికి తీసుకెళ్తున్న సవితా ఇంజనీరింగ్ కళాశాలకు ఫ్లెక్సీ లెర్న్ గుర్తింపు లభించింది. ఆ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటైన సభలో ఏసీటీఈ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ రాజీవ్‌కుమార్, చెన్నైలోని ఇండియన్ పేటెంట్ ఆఫీస్ అధికారి మహాలక్ష్మి, ఇంటర్నేషనల్ సైంటిఫిక్ కోఆపరేషన్ హెడ్ డాక్టర్ ఎస్కే వైష్ణవి, సవితా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎన్‌ఎం వీరయ్యాన్, సవితా ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ప్రధాన విద్యాకేంద్రంగా రాష్ట్రానికి గుర్తింపు

- సీఎం స్టాలిన్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యనందించడంలో రాష్ట్రం ముందజలో ఉందని, దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా ఐఐటీ మద్రాస్ ఆరోసారి ఎంపిక కావటం తమకెంతో గర్వకారణంగా ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఎన్‌ఆర్‌ఐఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం అత్యధిక సంఖ్యలో ఉన్నత విద్యా సంస్థలు కలిగి ప్రధాన విద్యాశక్తి కేంద్రంగా రాష్ట్రం మారిందని తెలిపారు. నాన్ ముదల్వన్, పుదుమైపెణ్, తమిళ్ పుదల్వాన్ వంటి వినూత్న పథకాల ద్వారా రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని, ద్రావిడ తరహా పాలనలోనే దేశ భవిష్యత్తు రూపొందించటంలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కీలకపాత్రను పోషించున్నారని వివరించారు.

అంగ వైకల్యంపై చెన్నై క్రెడాయ్ ఆధ్వర్యంలో 'వాక్ అలాంగ్ 2.0' పేరుతో యంగ్ ఇండియన్స్ నగరంలో నిర్వహించిన ర్యాలీలో భారీగా పాల్గొన్న యువతీ యువకులు, నగర వాసులు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంస



విద్యార్థులతో టి.నగర్ కేసరి పాఠశాల ప్రిన్సిపాల్ నాగుల గోపాలయ్య, ముఖ్యఅతిథి వెంకటశాస్త్రి తదితరులు

పెరంబూర్, ఆగస్టు 13: గత విద్యా సంవత్సరం టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందించే కార్యక్రమం మంగళవారం జరిగింది. టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌కు చెందిన కృష్ణప్రసాద్, గత పది సంవత్సరాలుగా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాలలో చదివి 10, 12 తరగతుల్లో అధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విద్యార్థులకు బంగారం, రజతం, కాంస్య పతకాలు అందజేస్తుంటారు. ఈ నేపథ్యంలో, గత ఏడాది జరిగిన పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థుల అభినందన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించారు. ఆయన ముఖ్యఅతిథి డా.ఎన్.వెంకటశాస్త్రిని పరిచయం చేస్తూ బహుభాషా కోవిదులుగా, ప్రజ్ఞాశాలిగా 24 సంవత్సరాలు అనుభవం, విద్యార్థుల వ్యవహారాలు, శిక్షణ, ప్లేస్‌మెంట్ తదితర సేవలు అందించారన్నారు. ఎస్‌ఆర్‌ఎం, ఎల్‌పీవీ తదితర దేశంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో పనిచేశారన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధిక మార్కులు పొందిన విద్యార్థులకు పతకాలు అందజేసి అభినందించారు.

చిత్రజ్యోతి

'బిగ్‌బాస్' హోస్ట్‌గా విజయ్ సేతుపతి?



బుల్లితెర ప్రేక్షకుల్లో ఎంతో ప్రజాదారణ పొందిన బిగ్‌బాస్ తమిళ రియాలిటీ షో ఎనిమిదో సీజన్‌కు ప్రముఖ హీరో విజయ్ సేతుపతి హోస్ట్‌గా వ్యవహరించనున్నారంటూ ప్రచారం సాగుతోంది. గత ఏడు సీజన్లకు హోస్ట్‌గా వ్యవహరించిన అగ్రహీరో కమల్ హాసన్ వచ్చే సీజన్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నట్టు ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో కొత్త హోస్ట్ ఎవరన్న అంశంపై ఇపుడు ఆసక్తి నెలకొంది. తొలుత సూర్య, శింబు, శివకార్తికేయన్ పేర్లు తెరపైకి రాగా, ఇపుడు విజయ్ సేతుపతి పేరు వినిపిస్తోంది. హీరో సూర్య తన ప్రాజెక్టులు 'సూర్య44', 'కంగువా-2'తో బిజీగా ఉండటంతో ఆయన నో చెప్పారు. ఆ తర్వాత విజయ్ సేతుపతిని సంప్రదించగా, ఆయన సూచనప్రాయంగా అంగీకరించినట్టు బిగ్‌బాస్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి సంబంధించి ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుంది. సినిమాలో హీరో, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, గెస్ట్ రోల్, వెబ్ సిరీస్, బుల్లితెర యాంకర్ ఇలా ప్రతి ఒక్క విషయంలోనూ ఎలాంటి ఇమేజ్ చూడకుండా రాణిస్తున్నారు. పైగా గతంలో 'నమ్మ ఊరు హీరో, మాస్టర్ చెఫ్' వంటివారికి యాంకర్‌గా వ్యవహరించారు. అందుకే బిగ్‌బాస్ నిర్వాహకులు సైతం విజయ్ సేతుపతి వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తుంది.

లగ్జరీ కారు కొనుగోలు చేసిన విజయ్



లెక్సస్ ఎల్‌ఎం మోడల్ లగ్జరీకారు - విజయ్

అగ్రహీరో విజయ్ మరో లగ్జరీ కారు కొనుగోలు చేసినట్టు కోలీవుడ్‌లో విస్తృతగా ప్రచారం సాగుతోంది. ఈ పుకార్లు నిజం చేసేలా ఆయన నివాసం నుంచి ఒక లగ్జరీకారు వస్తున్న దృశ్యాలకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విజయ్ వినియోగిస్తున్న లగ్జరీ కార్ల జాబితాలో ఈ కొత్త కారు కూడా చేరినట్టు సమాచారం. ఈ కొత్త కారు లెక్సస్ ఎల్‌ఎం మోడల్. దేశీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈ కారు ధర రూ.2 నుంచి రూ.2.50 కోట్లు(ఎక్స్ షోరూమ్) వరకు ఉండొచ్చని అంచనా. ఇందులో అనేక అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. కాగా 2005లో అమెరికా నుంచి బీఎండబ్ల్యూ (సఫైర్ మెటాలిక్) మోడల్ కారు దిగుమతి చేసుకున్న విషయం తెల్సిందే. అయితే, దిగుమతి సుంకం చెల్లించే విషయంలో వివాదం చెలరేగింది. చివరకు న్యాయస్థానం ఆదేశాలతో పన్ను చెల్లించారు. ఇపుడు ఈ కారును ఆన్‌లైన్‌లో విక్రయానికి ఉంచారు. ఈ నేపథ్యంలో తాజాగా లగ్జరీ కారును ఆయన కొనుగోలు చేసినట్టు ప్రచారం సాగుతుంది.


ఆర్యతో తొలిసారి జతకట్టనున్న నిఖిలా విమల్



హీరో ఆర్య సరసన యువ నటి నిఖిలా విమల్ తొలిసారి జతకట్టనుంది. గ్లామర్ డాల్‌గా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంది.దీంతో ఆమెను ఆర్య చిత్రంలో హీరోయిన్‌గా ఎంపిక చేశారు. పా.రంజిత్ దర్శకత్వంలో వచ్చిన 'సర్పట్టా పరంబరై' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత హీరో ఆర్య కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం 'మిస్టర్ ఎక్స్' మూవీలో నటిస్తున్నారు. ఈ మూవీ తర్వాత తమిళం, మలయాళం భాషల్లో ఏకకాలంలో రూపొందే ద్విభాషా చిత్రంలో నటించనున్నారు. మలయాళంలో ప్రముఖ కథారచయిత మురళిగోపి ఈ చిత్రానికి కథ సమకూర్చి డైరెక్ట్ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతుంది. ఇందులో భాగంగా హీరోయిన్‌గా నిఖిలా విమల్‌ను ఎంపిక చేయగా, ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

విశ్వనటుడు సినీ కెరీర్‌కు 65 యేళ్ళు

కోలీవుడ్‌లోనే కాకుండా, భారతీయ చిత్రపరిశ్రమలోనే అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న విశ్వనటుడు కమల్ హాసన్ 65వ యేట అడుగు పెట్టారు. నిర్మాణం, దర్శకుడు, నటన, గాయకుడు ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకున్న కమల్ హాసన్... గత 64 యేళ్ళుగా ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. ఆయన వెండితెరకు బాల నటుడిగా 'కళత్తూరు కన్నమ్మ' చిత్రం ద్వారా పరిచయమయ్యారు. ఈ సినిమా విడుదలై ఈ నెల 12వ తేదీతో 64 యేళ్ళు పూర్తి చేసుకుంది. కేవలం తమిళంకే పరిమితం కాకుండా, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో అనేక హిట్ చిత్రాల్లో నటించారు. 'బిగ్‌బాస్' తమిళ రియాలిటీ షోకు ఏకంగా ఏడు సీజన్లకు హోస్ట్‌గా వ్యవహరించారు. ఆయన సినీ కెరీర్‌లో అనేక చిరస్మరణీయమైన పాత్రలను పోషించారు. ఇపుడు దిగ్గజ దర్శకుడు మణిరత్నం డైరెక్ట్ చేస్తున్న 'థగ్‌లైఫ్'తో పాటు మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఒక వైపు హీరోగా రాణిస్తూనే మరోవైపు యువ హీరోలతో సినిమాలను నిర్మిస్తూ ఉత్తమ అభిరుచి కలిగిన నిర్మాతల్లో ఒకరిగా కొనసాగుతున్నారు. వెండితెరకు అనేక మంది కొత్త నటీనటులను, సాంకేతిక నిపుణులను పరిచయం చేసిన ఘనతను దక్కించుకున్నారు. ఆయన 65 యేళ్ళ సినీ కెరీర్‌కు విషెస్ తెలుపుతూ అనేక మంది సినీ ప్రముఖులు ట్వీట్స్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన కామన్ డీపీని రిలీజ్ చేశారు.



కమల్ సినీ కెరీర్‌పై ప్రత్యేక డీపీ